నవతెలంగాణ

1

ఆదిలాబాద్

మంగళవారం | జూన్ 18, 2024 | www.navatelangana.com

విజేతలకు బహుమతులు అందజేత

నేరడిగొండ : మండల కేంద్రంలో నెల రోజులుగా జరుగుతున్న నేరడిగొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై గెలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులంతా ఐకమత్యంతో ఉండి క్రీడాస్ఫూర్తిని చాటడం సంతోషంగా ఉందన్నారు. ఐదు సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తూ వస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వీడీసీ మాజీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, సురేందర్ రాథోడ్, ముండే పాండురంగ్, జాదవ్ ధన్‌రాజ్, సాయిరాం, నర్వడే రమేష్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

నవతెలంగాణ-దహెగాం

లైంగిక దాడికి గురై దారుణంగా హత్యకు గురైన చిన్నారి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. దుశ్చర్యకు పాల్పడిన నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు.



కూర'గాయాలు'..!

- తక్కువ ఎకరాల్లో కూరగాయ పంటల సాగు
- రూ.80దాటిన టమాట..రూ.90కి చేరిన వంకాయ
- హైదరాబాద్ నుంచి టమాట..మిర్చి దిగుమతి
- పెరిగిన ధరలతో వినియోగదారుల బెంబేలు
- ధరల నియంత్రణపై దృష్టి సారించని యంత్రాంగం

మార్కెట్‌లో కూరగాయల ధరలు మండుతున్నాయి. కొనలేని..తినలేని పరిస్థితికి తీసుకొచ్చాయి. రోజూ కూరల్లో వినియోగించే టమాట ధర ఏకంగా కిలో రూ.80పలుకుతుండగా.. వంకాయ, బీరకాయ, బెండకాయ వంటి కూరగాయలు రూ.90కి తక్కువకు రావడం లేదు. కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లిన వినియోగదారులు ఈ ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు. కిలో కొనాల్సిన వారు కేవలం పావుకిలోతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇక చిన్నాచితక ఉద్యోగుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. భోజనంలో కూరగాయలు లేకుండానే తినాల్సిన పరిస్థితి వచ్చింది. సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోవడం.. పంటల ఉత్పత్తి లేకపోవడంతో కూరగాయలకు తీవ్ర కొరత ఏర్పడింది. టమాట పంటను గతేడాది హైదరాబాదుకు ఎగుమతి చేయగా.. ఈ ఏడాది అదే పంటను అక్కడ్నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. పంట ఉత్పత్తి అయ్యే వరకు ఈ పరిస్థితి ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడంతో వినియోగదారులు మార్కెట్‌కు వెళ్లేందుకు జంకుతున్నారు. ఏది కొన్నా..రూ.50కిపైనే ధర ఉండటంతో జనాలు బెంబేలెత్తుతున్నారు. కూరగాయలకు బదులు చికెన్, గుడ్లు తదితర వాటిని కొనుగోలు చేసి కాలం వెళ్లదీస్తున్నారు. ఈ ఏడాది పంటలు చాలా తక్కువ విస్తీర్ణంలో వేయడం.. ప్రస్తుతం ఆయా పంటల కాలం ముగిసిపోవడంతో తీవ్ర కొరతకు కారణమవుతోంది. కిందటేడాది ఆదిలాబాద్ జిల్లాలో 2వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేయగా.. వర్షాలు సక్రమంగా లేకపోవడం.. టమాటకు మార్కెట్‌లో ఆశించిన ధర లేకపోవడంతో ఈ ఏడాది అనేక మంది రైతులు ఈ పంటను పండించలేకపోయారు. ముఖ్యంగా జిల్లాలోని గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ పరిసరాల మండలాల రైతులు అధికంగా టమాటను పండించి హైదరాబాద్‌కు ఎగుమతి చేసేవారు. కానీ ధర లేకపోవడం కారణంగా పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా గిట్టుబాటు కాలేదు. దీంతో ఈ ఏడాది కేవలం వెయ్యి ఎకరాల్లో మాత్రమే కూరగాయల పంటలు సాగుచేశారు. దీంతో మార్కెట్‌లో కూరగాయల కొరత ఏర్పడేందుకు కారణమైందని అధికారులు చెబుతున్నారు. దీంతో ఈ ఏడాది హైదరాబాదు నుంచే టమాట, మిర్చి పంటలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో అక్కడ్నుంచి ఇక్కడకు రావాలంటే రవాణ ఖర్చులు భారం కారణంగా కూరగాయలు పెరగడానికి కారణమవుతోంది.

ధరల నియంత్రణేదీ..?

వేసవి కాలం ముగిసిపోవడం.. వర్షాకాలం ప్రారంభం కావడంతో అనేక మంది రైతులు ఈ సమయంలోనే పాత వాటిని తొలగించి కొత్త పంటలు వేస్తుంటారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు రావాల్సిన కూరగాయలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రతి ఇంటిలో..ప్రతి రోజూ టమాటను తప్పనిసరిగా వినియోగించాల్సి ఉంటుంది. కానీ ఒక గుడ్డు ధర రూ.6 ఉండగా కిలో టమాటలు కొనుగోలు చేస్తే 12వరకు వస్తున్నాయి. దీంతో గుడ్డు కంటే ఒక్క టమాటనే అధిక ధర పలుకుతుందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ధరలు పెరిగి జనం ఇబ్బందులు పడుతున్న సందర్భంలో జిల్లా స్థాయి ఉన్నతాధికారి ఆధ్వర్యంలో ధరల నియంత్రణ కమిటీ సమావేశమై ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేశించాల్సి ఉంటుంది. కానీ కొన్నేండ్ల నుంచి ఈ ధరల నియంత్రణ కమిటీ అనేది లేకుండా పోయింది. కనీసం నూతన కమిటీని కూడా ఏర్పాటుచేయలేదు. దీంతో కూరగాయలు, నిత్యావసర ధరలు పెరిగి జనం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నా. వాటిని దూరం చేయగలిగేలా అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెరిగిన ధరలతో ఇబ్బందులు : మంజుల, రిక్షాకాలనీ, ఆదిలాబాద్

నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు కూడా అమాంతం పెరగడం చాలా ఇబ్బందిగా మారుతోంది. మార్కెట్‌లో కిలో రూ.90వరకు ఉండటంతో కొనలేని పరిస్థితి కనిపిస్తోంది. రోజువారీ కూలీలు, చిరుద్యోగులు వీటిని కొనుగోలు చేయాలంటే ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.ఉన్నతాధికారులు దృష్టిసారించి పెరిగిన ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి.



వేణుగోపాల స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

ఇందారం గ్రామంలో గల వేణుగోపాల స్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సత్యనారాయణచారి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పురోహితులు వేణుగోపాలస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ ఇందారం వేణుగోపాలస్వామి ఆలయం చుట్టు ప్రహరీగోడ నిర్మించడంతో పాటు ఆలయ ప్రాంగణంలో ఫ్లోరింగ్ నిర్మిస్తామని తెలిపారు. ప్రాచీన కాలం నాటి దేవస్థానమైన వేణుగోపాల స్వామి ఆలయాన్ని అభివృద్ధి పర్చి ఆశీస్సులు పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, మాజీ సర్పంచ్ గడ్డం మంజుల ప్రసాద్, నాయకులు జక్కుల వెంకటేశం, సంతోష్ యాదవ్, నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

ఇందారం గ్రామ పంచాయతీ ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఇందారం గ్రామాన్ని సందర్శించిన ఆయన ముస్లిం కుటుంబాలను కలిశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఫయాజొద్దీన్‌తో పాటు ఇతర కుటుంబాల వారిని కలిసి ఈద్ ముబారక్ చెప్పారు.

ప్రమాదకరంగా ధన్నూర్(బి) రోడ్డు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి వెళ్లే రోడ్డు కొద్ది రోజుల క్రితం పడిన వర్షానికి తెగిపోయి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు వెళ్లలేని స్థితిలో ప్రమాదకరంగా తయారైంది. ఈ రోడ్డు గుండా నిత్యం గ్రామస్తులు పంటపొలాలకు వెళ్తుంటారు. దీంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదమరచి ప్రయాణిస్తే ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లక్ష్యాలకనుగుణంగా చదువు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

పాఠశాల స్థాయి నుండి భవిష్యత్ లక్ష్యాలతో చదువు ప్రణాళికలు ఏర్పర్చుకోవాలని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ టర్బైన్ మెయింటనెన్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు వేణుగోపాల్‌రావు, డీజీఎం పంతులా నాయక్, డీజీఎం సేఫ్టీ సురేష్ అన్నారు. ఇటీవల మృతి చెందిన ఎస్టీపీపీ ఇంజనీర్ కిరీటి జ్ఞాపకార్థం సోమవారం భీమారం మండల కేంద్రంలో గల పేరల్ ఆఫ్ ఇండియా అనాథాశ్రమం విద్యార్థులకు చదువులకు సంబంధించిన సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య పట్ల ఆసక్తి పెంచుకుని ప్రతి విషయాన్ని ఇష్టంగా చదువుకోవాలని తెలిపారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే చిన్నప్పటి నుండి కష్టపడి చదువుకోవడం ద్వారా లక్ష్యాలను అధిరోహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అనాథ ఆశ్రమంలో గల పిల్లలకు అవసరమైన పెన్నులు, పుస్తకాలు, పెన్సిల్స్, ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేయడంతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ టర్బైన్ మెయింటనెన్స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు ప్రసాద్, రాకేష్, మహేష్, పవర్‌మేక్ కంపెనీ అధికారులు రాకేష్, సాగర్ మిశ్రా, వరప్రసాద్‌రెడ్డి, పలువురు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

తెలంగాణ బొగ్గు బ్లాక్‌లు

సింగరేణికి కేటాయించకపోతే పోరాటానికి సిద్ధం

- ఎస్‌కేఎంయూ మంద నరసింహారావు



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించకపోతే మరో పోరాటానికి సిద్ధంగా ఉన్నామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు అన్నారు. సోమవారం ఆర్కే న్యూటెక్, ఐకే 1ఏ గనులలో కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ మిత్ర పక్షాల సహకారంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వంలో తెలంగాణ నుండి ఎదిగి బొగ్గు శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కిషన్‌రెడ్డి సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం వేస్తామనడం సమంజసం కాదన్నారు. తెలంగాణలోని గనులకు గతంలో అనేక పర్మిషన్లు తీసుకొని, సింగరేణి డబ్బులతో కొత్తగా సత్తుపల్లికి దాదాపు రూ.1,000 కోట్లతో రైల్వే ట్రాక్‌కు ఖర్చు పెట్టి ఎక్స్‌ప్లోరేషన్ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన ఆ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించకుండా యాక్షన్‌లో పాల్గొనమనడం సరికాదని పేర్కొన్నారు. గతంలో ఒక్క టెండర్ వేసిన కోయగూడెం ఓసీ 3 బ్లాకును, సత్తుపల్లిలోని ఓసీ 3 బ్లాకును అరబిందో ఫార్మా కంపెనీకి ఎలాంటి బొగ్గు తీసే అనుభవం లేని వారికి కేటాయించటం అది కూడా బిజెపి ప్రభుత్వంతో కుమ్మక్కై, రూ.50 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు రూపంలో బిజెపి ప్రభుత్వానికి ముట్ట చెప్పిన వారికి కేటాయించారని మండిపడ్డారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డి తెలంగాణ వాదిగా సింగరేణి 15 బ్లాక్‌లను వేలంలో పెట్టడం సింగరేణి మనుగడకు విఘాతం కల్పించడమేనని విమర్శించారు. గతంలో ఈ విధానాలకు వ్యతిరేకంగా మూడు రోజుల్లో అన్ని యూనియన్లు కలిసి సింగరేణి వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేసి ప్రభుత్వానికి హెచ్చరిక చేసిన విషయం గుర్తుంచుకొని భవిష్యత్తులో ఇదే విధానాన్ని కొనసాగితే అన్ని యూనియన్లను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఒకవేళ సింగరేణి కొత్త గనులు కేటాయించకపోతే సింగరేణికి భవిష్యత్ అనేది ఉండదనే విషయాన్ని కిషన్‌రెడ్డి గ్రహించాలన్నారు. కేంద్రమంత్రిగా గతంలో సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్నును మినహాయిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకునేందుకు ఇప్పుడు బొగ్గు శాఖ మంత్రిగానే బాధ్యతలు తీసుకున్న కిషన్‌రెడ్డి తన వాగ్దానాలు నెరవేర్చటానికి పూనుకోవాలని తెలిపారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో అమలు చేసేందుకు కూడా బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్, ఆర్జీ-1అధ్యక్షులు నరహరి, పిట్ కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, పెరుక సదానందం, రాష్ట్ర కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నాయకులు రమేష్, ప్రతాప్, పుల్లారావు, సతీష్, రవి, రాజేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా పేరుకుపోయిన కార్మిక ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పెండింగ్ లోనే ఉన్నాయని అన్నారు. గత ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా స్కీం వర్కర్లు, కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన సమ్మెల సందర్భంగా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు గత ఐదు నెలలుగా బిల్లులు విడుదల కాకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు, గత ఐదు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని అన్నారు. షెడ్యూల్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు గత 15 సంవత్సరాలుగా వేతన సవరణలు లేక వేతనాలు పెరుగక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆరు నెలలు గడుస్తున్న కార్మికశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం కార్మికుల, ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రదర్శిస్తుందని అన్నారు. వెంటనే కార్మికశాఖ మంత్రిని ఏర్పాటు చేయాలని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పైన కార్మిక సంఘాలతో రాష్ట్ర సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి కె.సునీత, ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, ఏం.గంగన్న, సహాయ కార్యదర్శులు పి.జితేందర్, డి.వెంకటమ్మ, డీ సునీత, నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ అడ్వైజర్ కమిటీ సభ్యునిగా బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫామ్ అడ్వైజరి కమిటీ సభ్యునిగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఖానాపూర్ ఉద్యావన పట్టు పరిశ్రమ శాఖ అధికారి మౌనిక మర్యాద పూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చన్నారు. నెలనెల ఆదాయాన్నిచ్చే ఏకైక పంట అని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులు సాగుపై అవగాహన పెంచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతును రాజును చేయడమే లక్ష్యంగా పని చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రీయూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ మనోజ్‌రెడ్డి, క్లస్టర్ ఆఫీసర్ దినేష్ పాల్గొన్నారు.



మసీద్ అభివృద్ధికి సాయం

నవతెలంగాణ-బెజ్జూర్

మసీద్ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని గోల్కొండ మసీదులను సందర్శించి ముస్లిములకు బక్రీద్ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ సందర్భంగా ముస్లిములు దాన ధర్మాలు చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం కాంగ్రెస్ యూత్ నాయకుడు అబ్దుల్ హకీం ఇంటికి వెళ్లి బక్రీద్ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, పార్టీ మండల అధ్యక్షుడు భూస శంకర్ పాల్గొన్నారు.



ఎస్పీని సన్మానించిన సబ్ డివిజన్ పోలీసులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లోక్ సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నందుకు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా ప్రశంసాపత్రం పొందిన



ఎస్పీ గౌస్ ఆలంకు ఆదిలాబాద్ సబ్ డివిజన్ పోలీసులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సత్యనారాయణ, అశోక్, ఫణిందర్, సాయినాథ్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన గజేందర్ దారుణ హత్యకు గురయ్యాడు కాగా, బాధిత కుటుంబాన్ని సోమవారం ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. హత్య జరగడానికి గల కారణాలను తెలుసుకుని, హత్య చేసిన వారిపై చట్టప్రకారం శిక్ష నుంచి తప్పించుకోకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు అయ్యేలా చూడాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని తెలిపారు. హత్యకు గురైన బాధితుడి ఆస్తులు మొత్తం కుటుంబ సభ్యులకు అందేలా చూస్తామని, కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. వారి వెంట ఎంపీటీసీ బాదావత్ కళావతి ఉత్తం ఉన్నారు.



భక్తిశ్రద్ధల నడుమ బక్రీద్ వేడుకలు

- ఈద్గా మైదానం వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- పలువురు అధికారులు, రాజకీయ నాయకుల ఆలింగనాలు



ఆదిలాబాద్‌టౌన్: ప్రార్థనల్లో ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను జిల్లాలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధల నడుమ జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో జరిపే ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం పురపాలక యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. సోమవారం ఆయా ప్రాంతాల్లోని మసీదులతో పాటు ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దఎత్తున హాజరైన ముస్లింలతో ఈద్గా మైదాన ప్రాంగణం కిక్కిరిసి కనిపించింది. ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం బక్రీద్ పండగ విశిష్టతను తెలియచేశారు.

ప్రార్థనలు చేసిన ఎస్పీ గౌస్ ఆలం...

జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సాముహిక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. ఖుర్బానీ జరిపే సమయంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, ఎవరికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఎస్పీ



ఆదిలాబాద్‌టౌన్ : ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

సూచించారు. ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకునేలా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ నాయకులు...

ముస్లీంలకు అతి పవిత్రమైన బక్రీద్ సందర్భంగా ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస్‌రెడ్డి పట్టణంలోని ఈద్గాను సందర్శించారు. ముస్లింల ప్రత్యేక ప్రార్ధనల అనంతరం వారిని కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాలకు, ధర్మనిబద్ధతకు బక్రీద్ ప్రతీక అని అన్నారు. ముస్లీంలందరు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆనందోత్సహాల నడుమ బక్రీద్ జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా హిందూ ముస్లీంల మధ్య స్నేహ పూర్వక వాతావరణంలో ఉండాలని అన్నారు. అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అల్లాను ప్రార్ధించాలన్నారు. రైతుల ఇంట పాడి పంటలతో సిరులు కురువాలని ఆకాంక్షించారు. అలాగే డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, స్థానిక కౌన్సిలర్ కలాల శ్రీనివాస్‌తో పాటు పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు ఈద్గా మైదానం వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు.

ఉట్నూర్ : బక్రీద్ పండుగ సోమవారం మండలంలో లింగోజీ తాండ, హస్నాపూర్, తదితర గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని సుగుణ క్యాంపు కార్యాలయానికి వచ్చిన ముస్లింలను ఆప్యాయంగా పలకరించారు. ఇస్లాం మత విశిష్టతను, ముస్లిం త్యాగనిరతిని, ధర్మ నిబద్ధతను, దైవభక్తినీ చాటే ఈద్-ఉల్-అదా పండుగను ప్రతి ఒక్కరూ భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని సూచించారు.



ఉట్నూర్

నార్నూర్ : బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్, నాగల్‌కొండ, ఇలియాస్ నగర్ తదితర గ్రామాల్లో మౌలానా ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరినొకరు అలింగనం చేసుకుని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు అబ్బాస్, హంజా, రియాజ్, మోబీన్, అజ్జు యువకులు ఉన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో బక్రీద్ పండుగను ముస్లీంలు ఘనంగా జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునేదే బక్రీద్ పండుగ అని అన్నారు. ఈద్గా వద్ద నమాజ్ ముగించుకుని వస్తున్న క్రమంలో ముస్లింలను కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను, సహోదర భావాన్ని అందరూ అనుసరించాలని ఆకాంక్షించారు. మనమందరం కలిసి మెలిసి ఉండాలని అన్నారు. అనంతరం వారితో అలాయి బలాయి ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతారెడ్డి పాల్గొన్నారు.



నేరడిగొండ : శుభాకాంక్షలు తెలుపుతున్న ఆడే గజేందర్

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

- పరామర్శించిన ఎంపీ గోడం నగేష్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని హీరాపూర్ పంచాయతీ పరిధిలోని మారుతిగూడకు చెందిన మాజీ సర్పంచ్ గోడం నాగోరావ్ సోమవారం గుండెపోటుతో మరణించారు. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం వేకువ జామున ఛాతీలో నొప్పితో పాటు అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు వెంటనే ఇంద్రవెల్లిలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి డాక్టర్ మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించగా, అప్పటికే మరణించినట్టు వైద్యులు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎంపీ గోడం నగేష్, నాగోబా ఆలయ కమిటీ చైర్మెన్ మెస్రం తుకారాం, మాజీ ఎంపీపీ, కనక తుకారాం, మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, పార్థివ దేహానికి, పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన ఇంద్రవెల్లిలోని రైతు ఉత్పాదక కంపెనీ (ఐఎఫ్‌పీసీఎల్)లో గత కొన్నేండ్లుగా డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ కంపెనీ ద్వారా రైతు సంఘాలను ఏర్పాటు చేసి అనేక సేవలు చేశారు. అందరితో కలిసి మెలిసి ఉండే ఇతని ఆకాల మృతి పట్ల మాజీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కినక జుగాదిరావ్ తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఉరేసుకొని గురుకుల మల్టీపర్పస్ వర్కర్ ఆత్మహత్య

నవతెలంగాణ-ఇచ్చోడ

ఉరేసుకొని గురుకుల మల్టీపర్పస్ వర్కర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర కళాశాలలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బృందావనం కాలానికి చెందిన కుమ్ర నాందేవ్(56) గత ఆరు సంవత్సరాల నుంచి ఇచ్చోడ మండలంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీ బాలుర కళాశాలలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గత నాలుగు ఐదు నెలల నుంచి అతిగా మద్యం తాగి వింతగా ప్రవర్తిస్తున్నట్టు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 5:30 ప్రాంతంలో హాస్టల్ డైనింగ్ హాల్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య కుమ్ర చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.నరేష్ తెలిపారు.

విద్యుత్ బిల్లుల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యుత్ బిల్లుల్లో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసమే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని భుక్తాపూర్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. పలువురు వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులు తీసుకుని వచ్చి సంబంధిత శాఖ అధికారులకు తమ సమస్యలను విన్నవించారు. రెండు వందల యూనిట్లలోపు విద్యుత్ వినియోగం జరిగినప్పటికీ జీరో బిల్లు రావడంలేదని, రావాల్సిన దానికంటే అధిక బిల్లులు వస్తున్నాయని, ఇలా రకారకాల కారణాలతో విద్యుత్‌శాఖ అధికారులను కలిసి సమస్యలను విన్నవించారు. వారికి అర్జీల రూపంలో అందజేసి వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించారు. తప్పకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ట్రాన్స్‌కో సీఎండీ ఆదేశాల మేరకు ఇక నుండి ప్రతి సోమవారం ఈ ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ ప్రజావాణికి వచ్చి తమ బిల్లులకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా అర్జీల రూపంలో విన్నవించుకోవడానికి మంచి అవకాశమని తెలియజేశారు. సిటిజన్ చార్టర్ ప్రకారం లేదంటే ఎస్‌టీపీ ద్వారా సమస్యల పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ శంకర్, జేఏఓ అరుణ్‌కుమార్, జేఏలు రవికుమార్, వంశీకృష్ణ, ఆర్టిజన్ గణేష్ పాల్గొన్నారు.

జైలులో అస్వస్థతకు గురైన మహిళ ఖైదీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న మహిళా ఖైదీ అస్వస్థతకు గురైంది. జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని నార్నూర్ మండలంలో ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్ హత్యకేసులో రిమాండ్‌లో ఉన్న ఆయన భార్య విజయలక్ష్మి 16న ఆదివారం సాయంత్రం 4 గంటలకు తనకు తినటం ఇబ్బందిగా ఉందని కడుపునొప్పి ఉందని తెలిపింది. ఆమెను విచారించగా తను జైలుకి రాక ముందు చిన్న చిన్న బ్లేడు ముక్కలు మింగిందని చెప్పింది. వెంటనే జైలు సిబ్బంది ఆమెను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో వైద్య పరీక్షల నిమిత్తం అడ్మిట్ చేశారు. వైద్యులు అవసరమైన చికిత్స అందించి, 17న సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు డిశ్చార్జ్ చేసి జైలుకు పంపారు. ఆమె జైలులో ఎటువంటి బ్లేడు ముక్కలు మింగటం గాని, బ్లేడు ముక్కలతో కోసుకోవటం గాని, ఎటువంటి హైడ్రామా, నటన గాని జరుగలేదని స్పష్టం చేశారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఉట్నూర్

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సాకెర(బి) గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సాకెర(బి)గ్రామంలో తొడసం అర్జున్(25) చెనులోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మనోహర్ తెలిపారు.

కనక గణపతి స్ఫూర్తితో ఉద్యమిస్తాం

- టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీ హక్కుల నాయకుడు, గిరిజన ప్రజా సమస్యల పోరాట యోధుడు కనక గణపతి స్ఫూర్తితో గిరిజన ప్రజల సమస్యలపై పోరాడతామని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రణదివే నగర్‌లో కనక గణపతి 5వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏండ్ల పాటు ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించారని, చదువు రాకపోయినా నేర్చుకొని ప్రజా సమస్యల పై అనర్గళంగా మాట్లాడుతూ గిరిజన ప్రజల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి ఎండ గట్టే వాడని కొనియాడారు. నిత్యం ఏదో ఒక గ్రామ సమస్యపై పని చేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండేవాడని తెలిపారు. ఆయన స్ఫూర్తితో గిరిజన ప్రజల సమస్యలపై పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంక రాఘవులు, నాయకులు శకుంతల, జమున, భగవండ్లు, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : కనక గణపతి, ఆత్రం భగవంత్‌రావు ఆశయ సాధనకు కృషి చేద్దామని టీఏజీఎస్ మండల కార్యదర్శి మడావి నాగోరావు అన్నారు. సోమవారం వారి వర్ధంతులను ఉట్నూర్‌లోని ఎర్ర గుట్ట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసుల సమస్యలు, హక్కులకై నిరంతరం పోరాటాలు చేశారని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



పోడు సాగును అడ్డుకున్న అటవీ అధికారులు

నవతెలంగాణ-బేల

మండలంలోని భాది అటవీ బీట్‌లో పోడు సాగు చేస్తున్న రైతులను అటవీ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. రైతులు సాగు చేస్తున్న పోడు భూముల్లో కందకాలు తవ్వి చెట్లను పెంచడానికి అటవీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో రైతులు అటవీ అధికారులకు అడ్డుకునే ప్రయత్నం చేశారు. గత ఇరవై సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న, పోడుభూములను సాగు చేయనివ్వకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ఇరవై సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేస్తున్నామని పేర్కొన్నారు. అటవీ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తూ భూములు లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడున్న రైతులకు కనీసం ఒక గుంట భూమి కూడా లేదని,



ఉన్న పోడు భూములను అటవీ అధికారులు లాక్కుంటే బ్రతకడం కష్టమౌతుందని ఆవేదనవ్యక్తం చేశారు. ఉన్న భూములను అటవీ అధికారులు లాక్కుంటే పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, ఫారెస్ట్ అధికారుల వేధింపుల నుంచి తమను కాపాడి తమకు తగు న్యాయం చేయాలని కోరారు.

ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చోడ మండలంలోని గిరిజన గురుకుల పాఠశాల కళాశాలలో పనిచేస్తున్న నాందేవ్ ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ సంఘం జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఐటీడీఏ పీఓతో పాటు న్యాయ నిపుణులతో నిజనిర్ధారణ కమిటీ వేయాలని అన్నారు. గురుకుల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తరుచూ పనిలో ఇబ్బంది పెట్టడమే కారణమని ఆరోపించారు. పాఠశాలలు ప్రారంభంతోనే ఇలాంటి సంఘటన జరిగిందని ఇది చాలా బాధాకరమైన విషయమన్నారు. గిరిజన గురుకుల పాఠశాలల ఆర్సీఓ పర్యవేక్షణ లోపం కారణంగా జరిగిందని భావిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ని నియమించాలని అన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా నాయకులు నరేందర్, రాకేష్ ఉన్నారు.



భర్తను చంపించిన భార్యను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

నార్నూర్ మండలం నాగల్‌కొండ గ్రామానికి చెందిన రాథోడ్ గజేందర్ ఉపాధ్యాయుడిని దారుణంగా హతమార్చిన భార్య విజయలక్ష్మితో పాటు మరో ముగ్గురు నిందితులను కఠినంగా శిక్షించాలని, విజయలక్ష్మిని ప్రజా కోర్టులో ఉరితీయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్‌లో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ గజేందర్ ఉపాధ్యాయుడు సౌమ్యుడు అందరిని కలుపుగోపుగా నవ్వుతూ పలకరించే వాడని అన్నారు. అతడిని అతి దారుణంగా, కిరాతకంగా హతమార్చడం బాధాకరమని అన్నారు. ఆరేండ్ల బాలుడు అనాథగా మారాడని చింతిస్తున్నామన్నారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసినంత మాత్రాన సరిపోదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేకంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు కేసు బదిలీ చేసి సత్వర న్యాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బాపూరావు, జిల్లా ఉపాధ్యక్షులు జాదవ్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి ఉన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ జనార్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల దస్నాపూర్, ధోబి కాలనీ, పిట్టలవాడ, కోజా కాలనీ, రాంనగర్, సుభాష్‌నగర్, ఎంప్లాయిస్ కాలనీ, టైలర్స్ కాలనీ, పోలీస్‌కాలనీ, గ్రీన్ సిటీ, కేఆర్కే కాలనీ ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

కురిసిన వర్షం.. మురిసిన రైతు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో రైతన్న మురిశాడు. విత్తనాలు విత్తి వారం రోజులుగా వరణుడు కరుణించక పోవడంతో రైతన్న కారుమబ్బుల వైపు కోటి ఆశలతో ఎదురు చూశాడు. సాయంత్రం కురిసిన వర్షముతో పత్తి విత్తనాలకు ప్రాణం పోసినట్టు అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19, 20 తేదీలలో వివిధ ప్రయివేటు కంపెనీలలో ఉద్యోగాల భర్తీకి డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినరసింహం తెలిపారు. ఐసిఐసిఐ, ఎస్ బ్యాంక్‌లలో రిలేషన్షిప్ మేనేజర్లుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన, ప్రస్తుతం తృతీయ సంవత్సరం పరీక్షలు రాసిన అభ్యర్థులు ఈ నెల 19న ఉదయం10 గంటలకు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని సూచించారు. 20న కెమిస్ట్రీతో డిగ్రీ పూర్తిచేసిన బీఎస్సీ అభ్యర్థులకు శ్రీకృష్ణ ఫార్మా కంపెనీ వారు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన పురుష అభ్యర్థులు ఈ నెల 19 లోపు 7013607011కి తమ వివరాలు వాట్సప్ ద్వారా పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7013607011ను సంప్రదించవచ్చని తెలిపారు

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గడిచిన పార్లమెంటు ఎన్నికల్లో ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆత్రం సక్కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆయన ఫామ్ హౌస్‌లో ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా జడ్పీ ఎన్‌చార్జి చైర్మన్ కోనేరు కృష్ణారావు హాజరయ్యారు. చైర్మన్ సిద్దల దేవయ్య, వైస్ చైర్మన్‌గా వార్ల తిరుపతితోపాటూ మరో 11 మంది డైరెక్టర్లతో మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కోనేరు కీష్టారావు మాట్లాడుతూ మార్కెట్ కమిటీలో పనిచేస్తున్న ఉద్యోగులు రైతులకు న్యాయం చేసేలా పనిచేయాలని సూచించారు. ఏఎంసీ ఆధ్వర్యంలో అందుతున్న సంక్షేమ పథకాలను రైతులకు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీఏసీఎస్ చైర్మన్ ఉమామహేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాసం శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ ఇన్‌చార్జి, పాలకవర్గ సభ్యులు కలిశారు.

నిజాయితీ నిరూపించుకున్న ఆర్టీసీ కండక్టర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిపో పరిధిలో పనిచేస్తున్న ఆర్టీసీ కండక్టర్ ఆశన్న తన నిజాయితీని నిరూపించుకున్నారు. డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుండి ఆసిఫాబాద్ వస్తున్న బస్సులో పెద్దపెల్లి జిల్లా కళ్యాణికానికి చెందిన సాంబమూర్తి, లక్ష్మీ దంపతులు మందమర్రి స్టేజ్ వద్ద బస్సు ఎక్కి ఆసిఫాబాద్ మండలంలోని బూరుగూడ వద్ద దిగిపోయారు. దంపతులు తమకు చెందిన బంగారు గొలుసు బస్సులో సీటుపైన పోగొట్టుకున్నారు. బస్టాండ్‌కు వచ్చిన తర్వాత గుర్తించిన కండక్టర్ బంగారు గొలుసు డిపోలోని ఎర్నింగ్ సెక్షన్‌లో అందజేశారు. బాధితులు డిపోలో సంప్రదించగా సోమవారం బంగారు గొలుసును బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితులు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఈ విశ్వనాథ్, టీఐ 3 భారతి, ఏడీసీ బాపురావ్, శంకర్, స్టేషన్ మేనేజర్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులను ప్రారంభించిన ఎంపీపీ



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తుంగెడ గ్రామంలో చల్ల మల్లన్న దేవాలయంలో నూతన ఏర్పాటు చేస్తున్న బోర్వెల్ పనులకు ఎంపీపీ జుమిడి సౌందర్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుంగడ గ్రామానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చల్ల మల్లన్న దేవాలయంలో ప్రతి సంవత్సరం బోనాల పండుగ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని వారికి తాగునీటి సౌకర్యార్థం బోర్‌వెల్ వేయడం జరిగిందని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు బోర్‌వెల్ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాసిగామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, భగవాన్ తిరుపతి, ధర్మయ్య హరీష్, తిరుపతి, గంగయ్య, నాగయ్య పాల్గొన్నారు.

గ్లైసిల్ నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



నవతెలంగాన-దహెగాం

మండలంలోని హత్తిని గ్రామంలో 124 కిలోల పత్తి విత్తనాలు పట్టుకొన్నట్టు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హత్తిని గ్రామం నుంచి అందిన సమాచారం మేరకు హత్తిని గ్రామంలో తాళ్లపల్లి మనోజ్‌రావు ఇంట్లో బండి సింహాద్రి అనే వ్యక్తి 124 కిలోల గ్లైసిల్ పత్తి విత్తనాలను సోమవారం ట్రాక్టర్లో లోడ్ చేస్తుండగా పట్టుకున్నారు. సింహాద్రిని విచారించగా తాళ్లపల్లి మనోజ్ రావు విత్తనాలు వేరే చోటికి తరలించమన్నట్లు తెలిపాడన్నారు. ఇన్చార్జి ఏఓ రాజులు నాయుడు ఫిర్యాదు మేరకు తాళ్లపల్లి మనోజ్ రావ్, బండి సింహాద్రిలపై కేసు నమోదు చేసి, విత్తనాలు సీజ్ చేసినట్టు తెలిపారు. వాటి విలువ రూ.3,10,000 ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మసీదులలో ముస్లింలు సామూహిక ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మొహమ్మద్ ప్రవక్త చూపించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఇమామ్‌లు సూచించారు. జిల్లా కేంద్రంలోని బాబాపూర్ రోడ్డులో గల మసీదు వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, జడ్పీటీసీ నాగేశ్వరరావు మైనారిటీలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తారిక్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దహేగాం : మండలంలో సోమవారం బక్రీద్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం బీబ్రా గ్రామంలో లో గల ఈద్గాతో పాటు ఒడ్డు గూడ మొట్లాగూడా గొర్రెగుట్ట తదితరుల గ్రామాల్లో మజీద్‌లలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించుకుని ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బెజ్జూర్ : మండలంలో బక్రీద్ పండుగను ముస్లిములు ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం ఉదయం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేసిన అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. వివిధ పార్టీల నాయకులు ఈద్గాకు చేరుకొని ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు మత పెద్దలు బక్రీద్ పండుగ విశిష్టతను తెలియజేశారు. ఇంట్లో తీపి వంటకాలు చేసుకొని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. పండగ సందర్భంగా పేదలకు సాయం చేశారు.

ఎస్పీగా డీవీ.శ్రీనివాసరావు నియామకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎస్పీగా డీవీ శ్రీనివాసరావును నియమిస్తూ డిజిపి రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వస్తున్నారు. ప్రస్తుతం జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సురేష్‌కుమార్‌ను బాలానగర్ డీసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం మారినప్పటి నుండే ఎస్పీ బదిలీ జరుగుతుందని చర్చ నడుస్తుండగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యమైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎట్టకేలకు రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది ఎస్పీల బదిలీలో భాగంగా జిల్లా ఎస్పీ కూడా బదిలీ అయ్యాడు.

విద్యుత్ ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి సోమవారం ఆసిఫాబాద్ సెక్షన్ కార్యాలయంలో నిర్వహించే విద్యుత్ ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ పట్టణ ఏఈ సదాశివ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ సెక్షన్ కార్యాలయంలో సోమవారం పట్టణ పరిధిలోని వివిధ సమస్యలపై వచ్చిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే నేరుగా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని భట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పటేల్ గార్డెన్‌లో ఈ నెల 21న ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు 10వ అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహించనున్నట్టు పతాంజలి యోగ సమితి జిల్లా ప్రచారసమితి శిక్షకులు దాసరి వినోద్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తి గల విద్యార్థిని విద్యార్థులు, మహిళలు, పురుషులు వదులుగా ఉండే దుస్తులు ధరించి పరిగడుపుతో రావాలని తెలిపారు. ప్రతి రోజూ యోగ ఆసనాలు చేయడంతో ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్ నగర్ సబ్ స్టేషన్‌లో మంగళవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు కాగజ్‌నగర్ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్ రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ ఎల్ కిషన్, ఫోర్త్ మెంబర్ ఎం రాజాగౌడ్ నేతృత్వంలో వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని కాగజ్‌నగర్ పట్టణ, మండలంతోపాటూ దహేగాం మండల విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణ, కాగజ్‌నగర్, దహేగాం మండలాల విద్యుత్ వినియోగదారులు సదస్సును సద్వినియోగం చేసుకుని తమ విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవాలని ఏడీఈ సూచించారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా : ఎంపీ నగేష్



నవతెలంగాణ-తాంసి

గత పార్లమెంట్ ఎన్నికల్లో నా విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ కష్టంలో పాలు పంచుకుంటానని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడం నగేష్ కార్యకర్తలకు భరోసా కల్పించారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ ఆత్మీయ సన్మాన సభను నిర్వహించారు. మొదటగా అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల నాయకులు గజమాలతో ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. మండల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నా విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటానని అన్నారు. గతంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులను దుర్వినియోగం చేసింది. అవినీతి అక్రమాలు గత ప్రభుత్వంలో జరిగాయి. గతంలో లబ్ధిదారులు దళితబంధు, డబుల్ బెడ్‌రూం, దళితబస్తీ. పథకాలు పొందడం కోసం ఒక్క లబ్ధిదారుడి నుంచి రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు మండల నాయకులు తీసుకోవడం జరిగిందన్నారు. అలాంటి అవినీతి ఇకముందు జరుగుతే ఉపేక్షించేది లేదని అన్నారు. రాంపూర్ నుంచి కప్పర్ల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి అన్ని పదవులను గెలుపొందుకుందామని అన్నారు. ఈ దేశాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలోకి తీసుకువెళదామని అన్నారు. అనంతరం వివిధ కుల సంఘాల సభ్యులు పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, జెడ్పీటీసీ రాజు, పార్లమెంట్ కోకన్వీనర్ మహేష్ చంద్, మండల నాయకులు సంతోష్‌రెడ్డి, రాకేష్ యాదవ్, అరుణ్, నారాయణ, బుచ్చన్న, సదానందం, పరమేష్, స్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాజీవ్ గాంధీ చౌరస్తాలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మార్త సత్యనారాయణ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం 2007లో భారత ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఈ చట్టం ప్రకారం వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ, బాధ్యత పిల్లలదేనని చెప్పారు. దేశంలో 11 శాతం వయోవృద్ధులున్నారని, వారి ఆరోగ్య బాధ్యతలను పిల్లలు సక్రమంగా చూడాల్సి ఉంటుందన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ ఎంతో మంది వృద్ధులు ఎవరి ఆదరణ లేకుండా జీవనం సాగిస్తున్నారని, వారి సంరక్షణకు చట్టపరంగా ప్రభుత్వ పథకాల ఫలాలు అందించేలా అవగాహన కల్పించాలన్నారు. ఏఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ చట్ట ప్రకారం వయోవృద్ధుల హక్కులకు భంగం కలిగించరాదని, వయోవృద్ధులను బాధ్యతగా చూసుకోని పిల్లలు శిక్షార్హులన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యదర్శి శివప్రసాద్, ఏఎస్ఆర్ మూర్తి, నారాయణ, కలికోట రమణయ్య, ఎల్లగౌడ్, తూడూరి ప్రకాష్, గుల్లపల్లి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, కె బాలరాజు, మార్త ఉపేందర్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేస్తా : ఎంపీ

నవతెలంగాణ-తలమడుగు

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బీజేపీ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్‌కు సోమవారం మండల బీజేపీ నాయకులు విజయోత్సవ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యుడిగా గెలిపించినందుకు మండల ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలు తన గెలుపే ధ్యేయంగా పనిచేశారని వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. గతం లో ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు మండలంలో సీసీరోడ్లతో పాటు రూ.15 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్ రూ.20 లక్షలతో మంజూరు చేసినప్పటికీ ఇతరత్రా కారణాలవల్ల నిర్మాణం జరగలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బ్రహ్మానంద్, జెడ్పీటీసీ రాజు, కనపర్తి చంద్రకాంత్, ప్రభాకర్, స్వామి, కిరణ్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, కైలాస్, వెంకటస్వామి, రావుల ప్రేమేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ నగేష్‌ను కలిసిన వీహెచ్‌పీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎంపీ గోడం నగేష్‌ను విశ్వ హిందూ పరిషత్ నాయకులు కలిశారు. సోమవారం ఆయన స్వగృహంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందినందుకు పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు బోండ్ల నారాయణ, ఉపాధ్యక్షులు శ్రీరామ్ శర్మ, సహకార్యదర్శి రాజుల్వార్ దత్తాత్రేయ, నగర ఉపాధ్యక్షులు పట్టేపు సతీష్ పాల్గొన్నారు.

బెటాలియన్ కమాండెంట్‌గా నిఖిత పంత్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్రంలో భారీగా ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా యాపల్‌గూడ 2వ బెటాలియన్ కమాండెంట్‌గా నిఖిత పంత్ నియామకం అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇదివరకు కమాండెంట్‌గా పనిచేసిన చటర్జీని డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. 2017 బ్యాచ్‌కు చెందిన నిఖిత పంత్ టాస్క్‌ఫోర్స్ మెడ్చల్ డీసీపీగా పని చేశారు. పోలీసు శాఖలో టాస్క్‌ఫోర్స్ కీలకం. ఇప్పుడు జిల్లాకు బదిలీపై వచ్చారు. కాగా ప్రస్తుత జిల్లా కలెక్టర్‌గా ఉన్న రాజర్షిషా సతీమణి నిఖిత పంత్. ఒకే జిల్లాలో భార్య భర్తలు విధులు నిర్వహించడం విశేషం.

సవర్‌గాంలో భోగ్ బండర్

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని సవర్‌గాం గ్రామంలోని సోమవారం భోగ్ బండర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమై గత 15 రోజులు గడుస్తున్నా కూడా ఇప్పటివరకు వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు పడవకపోవడంతోని రైతులు పంటలు వేయక ఆకాశం వైపు చూసే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. వర్షాలు పడక బోరుబావుల్లో నీళ్లు లేక ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో రైతులు ఎన్నో బాధలు పడుతున్నారని అన్నారు. మరి కొన్ని గ్రామాలలో వర్షాలు పడతాయని నమ్మకంతో విత్తనాలు విత్తుకొని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మళ్లి విత్తనాల బ్యాగులు తెచ్చుకునే పరిస్థితులు లేక ఏం చేయాలోనని వాపోతున్నారు.

జిల్లా కేంద్రంలో ఉరుములతో కూడిన వర్షం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సోమవారం మధ్యాహ్నమంతా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపగా సాయంత్రం ఒక్కసారిగా జిల్లా కేంద్రంలో వాతావరణ మారిపోయింది. సాయంత్రం 6:00 నుండి కొద్దికొద్దిగా ప్రారంభమైన వర్షం 8 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సాయంత్రం కురిసిన వర్షం జిల్లా ప్రజలకు కొంత ఊరటనిచ్చింది. రైతులు విత్తనాలు విత్తి గత కొంతకాలంగా వర్షం కోసం ఎదురుచూస్తుండగా సోమవారం సాయంత్రం కురిసిన వర్షం కొంత పంటలకు మేలు కలిగిస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్పీకి హిందూ ఉత్సవ సమితి శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఈద్ ఉల్ ఆదా (బక్రీద్) పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్ తినిపించారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ప్రశంసా పత్రం పొందిన సందర్భంగా ఎస్పీకి అభినందనలు తెలిపారు. ఎస్పీని కలిసిన వారిలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, సభ్యులు హనుమాండ్లు యాదవ్, తోట పరమేశ్వర్ ఉన్నారు.

బాబోయ్ టమాట రూ.80

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో సోమవారం జరిగిన వారాంతపు సంతలో టమాటా కిలో రూ.80 ధర పలికింది. దీంతో వినియోగదారులు టమాటా కొనాలంటేనే ముక్కు మీద వేలేసుకుంటున్నారు. ఇవేమి ధరలు అని వినియోగదారులు వ్యాపారులను ప్రశ్నిస్తే 30 కిలోల పెట్టె, మాకే రూ.1200 నుంచి 1500కు హోల్ సేల్‌లో కొనుగోలు చేస్తున్నామని సమాధానం చెబుతున్నారు. ఇంకను వర్షాలు పడక పోతే రాబోయే రోజుల్లో మరింత ధరలు పెరిగే ఆవకాశం ఉందంటున్నారు. మన ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ టమాటా లేదన్నారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ నుంచి టమాటా దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు.

గల్ఫ్ మిత్రునికి రూ.21,500 ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం



అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు గురజాల రవికి తోటి గల్ఫ్ మిత్రులు రూ.21,500 ఆర్థిక సాయం అందజేశారు. గురజాల రవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మండలంలోని బాదంపల్లి గ్రామంలో ఆయన్ను తోటి గల్ఫ్ మిత్రులు సోమవారం కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ మిత్రులు తాటికొండ భోజరాం, దోమకొండ గంగాధర్, సిపిరిశెట్టి చందు, సీపిరిశెట్టి సత్తన్న, రెవెల్లి శ్రీనివాస్, మెరుగు సాయి, నిఖిల్ పాల్గొన్నారు.

కేకే ఓసీ ప్రాజెక్టును సందర్శించిన ఏరియా జీఎం

నవతెలంగాణ-మందమర్రి



కేకే ఓసి ప్రాజెక్టును సోమవారం ఏరియా జీఎం మనోహర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడూ రక్షణతో కూడిన నిర్దేశిత ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను అధిగమించడానికి ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా రక్షణతో కూడిన ఉత్పత్తిని పెంపొందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ రమేష్ కేకే ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్, సూర్యనారాయణ రాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జైపూర్ : సింగరేణి వ్యాప్తంగా ఉన్నటువంటి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం సింగరేణి భవన్‌లో గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ప్రాతినిధ్య సంఘం కార్యదర్శి జనక్ ప్రసాద్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశ్రాంత సింగరేణి ఉద్యోగుల సమస్యలు వివరించారు. ప్రధానంగా కోల్‌మైన్స్ పెన్షన్ పెంచాలని, చమురు సంస్థల విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చినట్లుగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మెడికేర్ స్కీం (సీపీఆర్ఎస్) ప్రస్తుత రూ.8 లక్షల పరిమితి ప్రస్తుత పరిస్థితుల్లో సరిపోవడం లేదని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా మెడికల్ పరిమితిని పెంచాల్సిన అవసరాన్ని గుర్తించాలని కోరారు. అదేవిధంగా హైదరాబాద్‌లో నెల వారి మందులు ఇచ్చే ఏర్పాటు చేయాలని, గత రెండు నెలల క్రితం జరిగిన సీపీఆర్ఎస్ ట్రస్ట్ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు పరచాలని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కోల్‌మైన్స్ పెన్షన్ చట్టం సవరించి బొగ్గు పెన్షన్‌దారులకు పెన్షన్ పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ద్వార కేంద్రానికి లేఖ రాయించాలని కోరారు. అదేవిధంగా అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అతి తక్కువ కోల్‌మైన్స్ పెన్షన్ పొందుతున్న వారికి కూడా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఆసరా పెన్షన్ పంపిణీకి కృషి చేయాలని కోరారు. ఇందుకు సంబంధించి కార్మిక సంఘ నాయకులు స్పందిస్తూ త్వరలో కేంద్ర, రాష్ట్ర మంత్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నివేదిస్తామమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండం రాజ్ రామచందర్ రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆలవందార్ వేణుమాధవ్, కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేఆర్‌సీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాబురావు, మాజీ డైరెక్టర్ జేవీ దత్తాత్రేయులు, నర్సింగ్ రావు, కనకయ్య, పూర్ణ ప్రకాష్, సాయిరాం గౌడ్, వెంకట రమణ, మాధవరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, మోటపలుకుల రమేష్ పాల్గొన్నారు.

● కార్మిక సంఘ నాయకులతో బొగ్గు పెన్షన్‌దారుల సమావేశం



వినతి పత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

ఈపీ ఆపరేటర్ పోస్టులు అంతర్గత ఉద్యోగులతో భర్తీ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి వ్యాప్తంగా ఉన్నటువంటి ఈపీ ఆపరేటర్ పోస్టులను అంతర్గత ఉద్యోగులతో భర్తీకి యాజమాన్యం నిర్ణయించింది. ఈపీ ఆపరేటర్ ట్రైనీ ఉద్యోగాల కోసం ఇచ్చిన సర్క్యులర్‌ను అనుసరించి ఈ నెల 18 నుండి 21 వరకు ఎంపిక పరిక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అర్హతలు గల అభ్యర్థులు 1705 మందికి ఇప్పటికే కాల్ లెటర్ పంపించినట్లు సంస్థ పేర్కొంది. వీరికి ప్రొఫిషయన్స్ టెస్ట్ నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 30న సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల కొత్తగూడెంలో రాత పరిక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. కాగా ప్రొఫిషయన్సీ పరిక్షల నిర్వాహణ కోసం సింగరేణి వ్యాప్తంగా ఉన్నటువంటి నిర్ణీత ప్రదేశాల్లో నిర్వహించనున్నారు. ఈ నెల 18,19 తేదీల్లో కొత్తగూడెం రీజియన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ (గ్రౌండ్స్) గౌతంపూర్, కొత్తగూడెం, భూపాల్‌పల్లి ఏరియాకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం (గ్రౌండ్స్) భూపాల్‌పల్లి, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాకు సంబంధించి ఎస్‌సీహెచ్ స్కూల్ (గ్రౌండ్స్) మందమర్రి, ఈ నెల 18 నుండి 20 వరకు ఆర్జీ-1 జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం (గ్రౌండ్స్) ఆర్జీ-1 అదేవిధంగా ఆర్జీ-2 ఆర్జీ-3 అండ్ ఏపీఏకు సంబంధించి రాణీ రుద్రమదేవి స్టేడియం, సెంటినరి కాలనీ ఆర్జీ-3, శ్రీరాంపూర్ ఏరియాకు సంబంధించి ఈ నెల 18 నుండి 21 వరకు ప్రగతి స్టేడియం (గ్రౌండ్స్) శ్రీరాంపూర్‌లలో నిర్వహించుటకు సంస్థ ఏర్పాట్లు చేసింది.

అభివృద్ధి పనుల్లో తాత్సారం తగదు

● ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మున్సిపాలిటి పరిధిలో కనీస సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనుల నిర్వాహణలో తాత్సారం తగదని ఎమ్మెల్యే వివేవ్ వెంకటస్వామి అంన్నారు. సోమవారం చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాల్టీ, విద్యుత్, అటవీ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పట్టణలో తాగు నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా తీరు పట్ల సంబంధిత శాఖ అధికారులతో చర్చించారు. అప్రకటిత విద్యుత్ కోతల విషయమై అధికారల నుండి వివరణ కోరారు. అదే విధంగా నియోజకవర్గం పరిధిలో గల పోడు భూముల విషయంలో అటవీ అధికారులతో సమీక్షించిన ఆయన అటవీ అనుమతుల కారణంగా అభివృద్ధి పనుల నిర్వాహణ నిలిచిపోయిన తీరుపై చర్చించారు. పోడు భూముల పంపిణీకి సంబంధించిన వివరాలు అడిగి తెల్సుకున్నారు..

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అంతజేత

చెన్నూర్ పట్టణానికి చెందిన సోలంకి శ్రీను వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు చేయించిన రూ.2 లక్షల ఎల్‌ఓసీ కుటుంబ సభ్యులకు అందజేశారు. సోలంకి శ్రీనుకు బ్రేన్ ఆపరేషన్ అవసరమై హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పెట్టుకున్న అర్జీ మేరకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వైద్యం కోసం నిధులు మంజూరు చేయించారు.

సింగరేణి ఐటీ విభాగానికి జాతీయ స్థాయి అవార్డు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి సంస్థ ఉద్యోగుల సమాచారానికి, సేవలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని విస్తృతంగా వాడుతున్నందుకు గుర్తింపుగా ఎక్స్‌ప్రెస్ కంప్యూటర్ అనే సంస్థ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఐటీ సేవల కంపెనీగా సింగరేణికి అవార్డు అందజేసింది. ఆదివారం రాత్రి జైపూర్‌లో జరిగిన జాతీయస్థాయి సమావేశంలో ఈ అవార్డును సింగరేణి సంస్థకు ప్రదానం చేయగా సోమవారం సింగరేణి భవన్‌లో సింగరేణి అధికారులు సీఎండీ ఎన్ బలరామ్‌కు అవార్డును అందజేశారు. సింగరేణి సంస్థకు ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ కేటగిరిలో ఈ అవార్డు లభించగా ఉద్యోగుల సమస్త సమాచారం, ప్రమోషన్లు తదితర విషయాలను ఎంప్లాయిస్ పర్సనల్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వార పొందుపర్చుతున్నందుకు జాతీయ స్థాయి సమావేశంలో ప్రత్యేక ప్రశంస లభించింది. సింగరేణి సంస్థ ఎస్ఏపీ (ఎంటర్‌ప్రైజ్ రిసోర్సు ప్లానింగ్ సాఫ్ట్ వేర్)ను అమలు చేసి దేశంలో మొట్టమొదటి బొగ్గు కంపెనీగా ఇప్పటికే సింగరేణి గుర్తింపు తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమచారాన్ని డిజిటలైజ్ చేస్తున్నందుకు మరో అవార్డు లభించడం పట్ల సంస్థ సీఎండీ బలరామ్ అభినందనలు తెలిపారు. ఆనతి కాలంలోనే సింగరేణి సంస్థకు పేపర్ లెస్ కంపెనీగా రూపుదిద్దాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఎస్ఏపీ ద్వార ముఖ్యమైన విభాగాల లావాదేవీలు మొత్తం కంపూటర్ ఆదారంగా నిర్వహిస్తున్నామని ఇకపై సింగరేణిలోని అన్ని లావాదేవీలు కూడా ఈఆర్‌పీ ద్వార నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవార్డు అందుకున్నందుకు జీఎం కోఆర్డినేషన్ దేవేందర్ నేతృత్వంలో ప్రాజెక్టు మేనేజర్ ఈఆర్‌పీ హర ప్రసాద్, ఐటీ డిప్యూటీ జనరల్ మేనేజర్లు హరి శంకర్, హరి ప్రసాద్, మేనేజర్ ఐటీ రామలక్ష్మయ్యలు సీఎండీ బలరామ్‌కు అవార్డు అందజేశారు.

● అత్యుత్తమ ఐటీ సేవల కంపెనీగా సింగరేణి



పరీక్ష ఏర్పాట్లను పరిశీలించిన జీఎం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రగతి మైదానంలో జూన్ 18 నుండి 21 వరకు నిర్వహించే ఈపీ ఆపరేటర్ పరీక్ష ఏర్పాట్లను శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఈపీ ఆపరేటర్ ప్రాక్టికల్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడం జరుగుతుందని అలాగే అభ్యర్థుల హాల్ టికెట్లను, ఐడెంటి కార్డులను తనిఖీ చేసిన తర్వాతే ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించాలని అధికారులకు సూచించారు. అలాగే ఎండలను దృష్టిలో ఉంచుకొని నీటి వసతిని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను, అభ్యర్థుల వైద్య సౌకర్యార్థం అంబులెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం వి పురుషోత్తమ రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం ఏరియా వర్క్ షాప్ రవీందర్, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, డీవై పీఎం వి దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ పి కాంతారావు, ఆటో వర్క్ షాప్ ఇంజనీర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుంది



నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగోన్నతితో బాధ్యత మరింత పెరుగుతుందని ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ మాలోతు రాముడు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలో క్యాటగిరి ప్రమోషన్లు పొందిన 50 మంది ఉద్యోగులకు సోమవారం అర్హత పత్రాలను ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వీరభద్రయ్యతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాటగిరి ప్రమోషన్లు తీసుకున్న కార్మికులను వారి వారి కర్తవ్యాలను నిర్వహిస్తూ రక్షణ సూత్రాలను పాటించి ఉత్పత్తి, ఉత్పాధకతను పెంచి సంస్థ మనుగడను పెంచాలని తెలిపారు. అదేవిధంగా సంస్థ కార్మికులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించడానికి ముందుంటుందని అన్నారు. సింగరేణిలో పనిచేయడం గొప్ప అవకాశంగా భావించాలని, ప్రతి ఒక్క కార్మికుడు కష్టపడి పని చేస్తూ సంస్థ అభివృద్ధికి సహకరించాలని, గుర్తింపు సంఘంగా కార్మికుల ప్రతి సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకపోయి పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శ్రీధర్, రక్షణ అధికారి రవిశంకర్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, ఇంజనీర్ ప్రవీణ్, వెంటిలేషన్ అధికారి జగదీష్ రావు, సంక్షేమ అధికారి సంతన్, అండర్ మేనేజర్లు రాము, రవీందర్, శశాంక్, శ్రీనివాస్, ఫిట్ సెక్రెటరీ బెర రవీందర్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో అల్పాహారం, పండ్లు పంపిణీ



నవతెలంగాణ-నస్పూర్

ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ కార్పొరేషన్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్-బీనాదేవి వివాహ వార్షికోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా ఐఎన్టీయూసీ నాయకులు శ్రీ సాయి అనాధాశ్రమంలో సోమవారం అల్పాహారం, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ రావు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కార్మిక హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తూ, ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుండి జాతీయస్థాయి నాయకుడిగా ఎదగడం మనమందరము గర్వించదగ్గ విషయమని అన్నారు. ఐఎన్టీయూసీలో పని చేస్తున్నా ప్రతి కార్యకర్తకు వారు ఆదర్శమని, వారు ఇలాగే ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జాతీయ సమితి సభ్యులు భీమ్ రావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కళవేన శ్యామ్, కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు గరిగే స్వామి, ల్యాగల శ్రీనివాస్, పేరం రమేష్, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతుల పెండ్లిరోజు వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి, సోనేరావు దంపతుల పెండ్లిరోజు వేడుకలు సోమవారం స్థానిక నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరావు ఆమె నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే దంపతులకు నూతన వస్త్రాలు అందించి పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ గౌడ్, కడతల మల్లయ్య, నాగేష్ పాల్గొన్నారు.



ఘనంగా బక్రీద్ వేడుకలు



జన్నారంలో..

నవతెలంగాణ-జన్నారం

త్యాగానికి ప్రతీక బక్రీద్ అని మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఫసీఉల్లా అన్నారు. సోమవారం స్థానిక ఈద్గా వద్ద బక్రీద్ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఆయన హాజరై ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం అస్సలామ్, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రజాక్, మున్ను మౌలానా పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలో సోమవారం ముస్లీంలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలో ఎటువంటి మతపరమైన గొడవలు జరకుండా పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు. కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు ఆయా ప్రాంతాల్లో బందోబస్త్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బూర రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కాసిపేటలో..

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రానికి చెందిన వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు వెన్నెల గోపి(28) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండల కేంద్రంలో వెల్డింగ్ షాపు నడుపుతున్న గోపి షాపు సరిగా నడవకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల పాటు చికిత్సపొందిన గోపి సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య వెన్నెల పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసునమోదు చేసినట్లు తెలిపారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

నవతెలంగాణ-రామకష్టాపూర్

పట్టణంలో స్థానిక ఎస్ఆర్‌కే పాఠశాల ఎదుట గల చాకలి ఐలమ్మ విగ్రహాన్ని రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ విగ్ర ఆవిష్కరణకు రాష్ట్ర, జిల్లా, రజక సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పట్టణంలోని అన్ని వర్గాల నాయకులను ఆహ్వానించి వారిని శాలువాలతో సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి పట్టణ రజక సంఘం అధ్యక్షుడు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ రజక సంఘం సభ్యులు, ఆయా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

